# ప్రేమాయణం

**– డి.వి.ఎస్. ఆర్. మూర్తి**

ప్రేమించి పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు శంకరం. కారణం వాళ్ళ ఇంగ్లీషు లెక్చరరు రొమేన్సు ఈజ్ లైఫ్ అని ఎన్నోసార్లు చెప్పాడు. అది లేకుండా పెళ్ళి చేసుకుంటే వైఫ్ నైఫ్ ట! వెడ్ లాక్ డెడ్‌లాక్ అవుతుందిట. అంటే వివాహ బంధం చిక్కుముడి.

పైగా శంకరం స్టార్ టీవీలో ప్రోగ్రాములు విడిచి పెట్టడు. బేవాచ్, బోల్డు అండ్ ది బ్యూటీఫుల్ లాంటివి చూసిన తరువాత అమెరికాలో ఎందుకు పుట్టలేదా అన్న బాధ. కారణం ప్రేమ ముందు. పెళ్ళి తరువాత. అందుకే డేటింగులు. ప్రేమ పుట్టగానే యువతి, యువకుడు కలిసి కాలక్షేపం చేస్తారు. పెళ్ళి చేసుకోవచ్చా లేదా అన్నది తేల్చుకుంటారు.

ఛ! ఛ! ఇదేమి దేశం అని చాలాసార్లు శంకరం అనుకున్నాడు. అతడి స్నేహితుడి అన్న ఐ.పి.యస్. ఆఫీసరు. తండ్రీ తల్లీ వెళ్ళి సంబంధం కుదిర్చారు. తాళికట్టేటప్పుడు అమ్మాయి ముఖం చూశాడు. అంతే! మంచి నీళ్ళు అని అరిచాడు. గ్లాసుడు నీళ్ళు గటగటా త్రాగితే కాని మూడుముళ్ళూ వేయలేకపోయాడు.

ఆ అమ్మాయి కాకి. అతడు దొండపండు. అప్పుడు అతడికి తెలిసింది. తాను తాళి కట్టింది అమ్మాయికి కాదు, డబ్బు మూటకు అని. అది చూసిన తరువాత శంకరం నిర్ణయం తీసుకున్నాడు ప్రేమించే పెళ్ళి చేసుకోవాలని.

ఎవరిని ప్రేమించాలా అని కొన్ని రోజులు శంకరం దీర్ఘంగా ఆలోచించాడు. తాను ప్రేమిస్తాడు. బాగానే ఉంది. ఆ అమ్మాయి తిరిగి ప్రేమించాలిగా! అది పెద్ద చిక్కుగానే ఎదురైంది. చిక్కులోనే ఉంది చిక్కని ప్రేమ. అదే అందం! అదే ఆనందం!

శంకరం బామ్మను తలచుకుంటే తన దారి ముళ్ళదారిలా కనుపించింది. తన పెళ్ళి చూసి చచ్చిపోతుందిట. తన పెళ్ళి చూడకుండా బాల్చీ తన్నేస్తే ఏం కొంపమునుగుతుందో శంకరానికి అంతుపట్టలేదు. పెళ్ళి చేసుకోమని రెండేళ్ళ నుండి ఒకటే పోరు. ఎలాగో వాయిదా వేసి బి.ఏ. చివరి సంవత్సరంలోకి వచ్చాడు. నా పెళ్ళి తొందరలోనే చూస్తావు, తొందరపడకు అన్నాడు. ఆ యమధర్మరాజు నా గురించి తొందర పడుతున్నాడు అంది బామ్మ.

ఈ పెద్దవాళ్ళ కోరికలకు చిన్నవాళ్ళు బలి అయిపోవలసిందేనా అన్న ఆలోచన శంకరానికి వచ్చింది. బలి ఇవ్వడానికి లాక్కుపోతున్న మేకపోతు అతడి కళ్ళముందు ప్రత్యక్షం అయింది. అంతే కార్యరంగంలో దూకడానికి సిద్ధం అయ్యాడు.

తొందరగా ఎవరో ఒక అమ్మాయిని ప్రేమించాలి. ఆ అమ్మాయిని తప్ప పెళ్ళి చేసుకోను అనాలి. చచ్చినట్లు పెద్దవాళ్ళు అంగీకరిస్తారు.

అప్పుడు శంకరం ఎవరిని ప్రేమించాలా అని ఆలోచించాడు.

అందమైన అమ్మాయినే ప్రేమించాలని నిర్ణయించుకున్నాడు శంకరం. అందమె ఆనందం అన్న పాట గుర్తుకు వచ్చింది. అదే జీవిత మకరందం అనుకున్నాడు.

తన చుట్టుప్రక్కల అందమైన అమ్మాయిలు ఎక్కడ ఉన్నారా అని గాలించాడు. తన వీధి చివరలో ఒక మేడ ఉంది. ఆ మేడ వరండాలో ఒక అందమైన అమ్మాయి కళ్ళబడింది. తొలి చూపులోనే ప్రేమ పుట్టింది. లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అంటే ఇదేనేమో అని మురిసిపోయాడు.

వెంటనే ఆ అమ్మాయితో చూపులు కలపడానికి ప్లాను వేశాడు. వివరాలు సేకరించాడు. పేరు వాణి. సాయంత్రం నాలుగు గంటలప్పుడు వరండాలో ఉంటుంది. ఆ వీధి మొగలో నిలబడి శంకరం చూపులు కలిపాడు.

ఒక వారం రోజులు శంకరం అక్కడ నిలబడి అమ్మాయి అందం చూసి ఆనందించాడు. నిజంగా అందం ఆనందమే! ఆ రోజు వాణి అతడి కేసి చూసి నవ్వింది. ఇక పైకి రమ్మంటుంది. ప్రేమించానని చెప్తుంది. శంకరం స్వర్గంలో విహరించాడు. సంతోషంతో ఉబ్బి తబ్బిబ్బు అయ్యాడు.

'ఒరే' అంటూ ఏదో చేయి భుజం మీద పడే సరికి ఉలిక్కిపడ్డాడు. అప్పుడే ఆనందం ఆవిరి అయింది. వాస్తవంలో పడి మేడమీద అమ్మాయి కేసి చూశాడు. అక్కడే నిలబడి దృశ్యం చూస్తోంది.

''ఇక్కడ రోజూ సాయంత్రం నీకేం పని?''

''నేను ప్రసాద్ గారి అబ్బాయిని ఈవీధి చివర మా మేడ ఉంది.''

'' ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నావా? పెళ్ళి చేసుకుంటావా?''

''ప్రేమ వన్ వే ట్రాఫిక్ కాదుగా?''

''అయితే సరే. లోపలికి రా. అమ్మాయికి పరిచయం చేస్తాను.''

శంకరానికి కాళ్ళు వణికాయి. లోపలికి తీసికెళ్ళి తంతాడేమో అన్న భయం ఆవరించింది. ప్రేమించడంలో ఇన్ని ఇబ్బందులు ఉన్నాయని ఊహించలేదు. ఏదో ప్రాధేయపడి ఆ పెద్ద మనిషి చేతుల్లోంచి బయటపడ్డాడు. పెద్ద గండం గడిచినట్లుంది. ఇక వీధిలో అటువైపు వెళ్ళడం మానేశాడు. అందమైన అమ్మాయి ఆనందం కాదని తేలింది.

ఇలా ముక్కూ మొహం తెలియని పిల్ల అందంగా ఉందని ప్రేమించకూడదని శంకరం తెలుసుకున్నాడు. అప్పుడు గుర్తువచ్చింది జయవాడ ప్రభుత్వ కళాశాల.

విద్యార్థులు విద్యార్థినుల జంటలు ఎక్కడపడితే అక్కడ ఆ కళాశాల ఆవరణలో ఎదురౌతాయి. చెట్ల క్రింద పచ్చిక మైదానంలో క్లాసు రూములో ఆ జంటలు ప్రేమ విహారం చేస్తూ ప్రపంచాన్నే మరచిపోతాయి. అది ఒక ప్రేమ మందిరంలా శంకరానికి కనిపించింది.

ఇంటరు చదువుతున్న మాధురితో శంకరం చూపులు కలిపాడు. మాటల్లో పడ్డాడు. మాధురి నేటి పిల్ల. శంకరానికి ప్రోత్సాహం లభించింది.

ఆడ పిల్లలు సిగ్గు మొగ్గలు. స్పర్శ శృంగాలకు అనుమానం గాలిసోకితే నత్త గుల్లలోకి ముడుచుకుపోయినట్లు వాళ్ళు సిగ్గుతో ముడుచుకుపోతారు. అది తప్పు అని శంకరానికి తెలిసింది.

మధ్యాహ్నం అయితే ఆ కళాశాలలో విద్యార్థులు ఉండరు. లెక్చరర్లూ కనిపించరు. ప్రేమ జంటలు మిగులుతాయి.

మాధురి కబుర్లు చెపుతూ శంకరాన్ని మైదానం వైపు తీసికెళ్ళింది. అక్కడ జన సంచారం ఉన్నట్లు లేదు. అక్కడ ఒక క్లాసు రూము విడిగా ఉంది. అది ప్రేమికుల పొదరిల్లు.

శంకరంతో కబుర్లు చెపుతూ మాధురి ఆ గదిలోకి తీసికెళ్ళింది. తలుపు గడియ పెట్టింది.

శంకరంలో ఏదో ఉద్వేగం. తన ప్రేమ కల పండే క్షణం వచ్చింది. నరాలు జివ్వుమన్నాయి. శరీరం పులకించింది. తనకు ఏదో అయిపోతున్నట్లు భావన.

''ఐ లవ్ యూ'' అంది మాధురి ముఖంలో ముఖం పెట్టి.

''ఐ టూ లవ్ యూ, మధూ!'' ముద్దుగ పిలిచాడు శంకరం. ఆ క్షణంలో మాధురి అతడికి వికసించిన పూవులా ఉంది. ఇక ఆ అనాఘ్రాణిత పుష్పాన్ని అందుకోవాలి. ఏదో మత్తులో అదే ప్రయత్నంలో ఉన్నాడు.

అంతే ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు. కాళ్ళక్రింద నేల లోపలికి పోయింది. మత్తు దిగింది. వణుకు మొదలయింది.

మాధురి అతడి ముందు పులిలా ఉంది. దాని నోటిలో చిక్కుకున్నాడు. ఏం చేయాలో తోచక కంగారు పడ్డాడు.

''భయపడకు డియర్'' అంది నిమ్మకు నీరెత్తినట్లు. ''భయం వెంటాడే ప్రేమ మధురం, కమ్ డియర్!''

''ఇంకా కమ్ ఏంటి? గమ్ అయిపోతా. దేవుడో! ఎలాగురో బయట పడడం'' కంగారు పడ్డాడు శంకరం.

తలుపు తెరవకపోతే బలవంతంగా త్రోసి లోపలకు వచ్చేలా ఉన్నారు. చాలామంది బయట చేరినట్లుంది.

శంకరం ఇక మాధురిని వదలాడు. వెళ్ళి తలుపు తీశాడు. ఎదురుగా గుంపు. అంతే అతడు తారాజువ్వలా వాళ్ళ మధ్య నుండి దూసుకుపోయాడు. పరుగు లంకించుకున్నాడు.

''పట్టుకోండి'' అన్న మాట శంకరం చెవుల్లో పడింది. కొందరు అతడి వెంట పడ్డారు. అప్పుడు పి.టి. ఉష కూడా పరుగులో అతడి ముందు ఓడిపోవలసిందే! అదేమి పరుగో!

మైదానంలో రన్నింగు రేసులు సాగుతున్నాయి. చూపువాసిలో శంకరం తప్పించుకుంటున్నాడు. కాలు కాలిన పిల్లిలా ఒకటే పరుగు. అందరూ అక్కడ వెర్రి ముఖాలు పెట్టారు. శంకరం గోడ దూకి బయటపడ్డాడు. అది హప్ స్టెప్ అండ్ జంపో హైజంపో ఎవరికీ తెలియ లేదు.

ఇంటికి వెళ్ళి శంకరం చూచుకున్నాడు. కాళ్ళూ చేతులూ తిన్నగా ఉన్నాయో లేదో. బ్రతుకుజీవుడా అనుకున్నాడు. డేమేజీ పెద్దగ ఏమీ లేదు. కాని పోలీసులు వచ్చి పట్టుకుపోతారేమోనని రెండు రోజులు బెదురుగ ఇంటిలో గడిపాడు.

అప్పుడే శంకరం బామ్మకు విపరీతమయిన జ్వరం వచ్చింది. ఇదేదో బెంగ రోగం. ఆ బెంగ పోతేకాని రోగం కుదరదన్నాడు డాక్టరు.

అందరూ శంకరం మీద పడ్డారు. వీడు బామ్మని పొట్టని పెట్టుకుంటాడన్నారు. శంకరం బామ్మ దగ్గరకు వెళ్ళాడు.

''నీ పెళ్ళి చూడకుండా నేను బాల్చీ తన్నేస్తే దెయ్యం అవుతాను. ఏ కోరికతో చచ్చిపోతే ఆ కోరికతో దెయ్యం అవుతారు. అప్పుడు నీవు ప్రేమించి పెళ్ళి ఎలా చేసుకుంటావో నేను చూస్తాను'' అని బెదిరించింది.

బామ్మ అన్నంత పని చేస్తుందని శంకరానికి నమ్మకం కలిగింది. ముందు ఆ పీడ వదలించుకోవాలి. కనుక గట్టిగా తల ఊపాడు పెళ్ళికి. మరునాడే శంకరం వెళ్ళకుండా అతడి పెళ్ళి నిశ్చయం అయింది. పైగా బోడి! నీవు చూసేదేమిటి? మేము చూశాం. చాలు అని కసిరారు పెద్దలు.

శంకరానికి ఓటమి ఎదురైంది. ప్రేమించి, పెళ్ళి చేసుకోవాలన్న అతడి ఆశ నిరాశ అయింది. ఓటమిని గెలుపు చేయడానికి నిర్ణయించుకున్నాడు.

ఎవరు కావాలి అన్న గొంతు ఎదురైంది.

''మానస'' అన్నాడు శంకరం ధైర్యంగా.

''నేనే'' అంది ఆ గొంతు.

మానసను చూసేసరికి ఆ లోకంలో లేడు శంకరం. తాను అప్పటివరకూ ప్రేమలో పడ్డపిల్లలందరూ ఆమె ముందు బలాదూర్. అతడి కళ్ళు జిగేలుమన్నాయి. మనస్సు అదుపు తప్పింది. ఐ లవ్ యూ అంటూ అతడు ఆమె చేయి పట్టుకున్నాడు.

మానస పెద్దగా ఏదో అత్యాచారం జరిగినట్లు అరిచింది. ఆ ఇంటిలో అందరూ పరుగు పెడుతూ డ్రాయింగు రూములో చేరారు. విషయం తెలిసింది.

''ఐలవ్యూ అంటావురా?'' అంటూ మానస తమ్ముడు ముందుకు దూకాడు. శంకరం కాలరు పట్టుకు నేలా ఉన్నాడు.

''తొందరపడకండి'' అన్నాడు శంకరం తేరుకుని.

''నేను చెప్పేది వినండి''

''రెండు లాగరా. లవ్ గివ్ అవుతుంది. పెళ్ళి కుదిరిన పిల్లను ఐలవ్యూ అంటావురా? పెళ్ళిపాడు చేద్దామనా?'' ఒక గొంతు అరిచింది.

''ఇంకా చూస్తావేమిటిరా?'' ఇంకొక గొంతు.

''నన్ను కొట్టకండి. కొడితే తరువాత మీరే బాధపడాలి. నామాట వినండి'' ప్రాధేయపడ్డాడు శంకరం.

''వినం. నీ తోలు తీస్తాం.''

''నేనే మానసకు కాబోయే భర్తను'' అరిచాడు శంకరం దెబ్బమీద పడకుండా.

''ఓరి అబద్ధాల పుండాకోరు పింజారీ!''

''నిజం చెపుతున్నాను'' అన్నాడు శంకరం.

''ఆ అబ్బాయి నీలా జుట్టు పోలిగాడు కాడు.''

''వాళ్ళ వంశం ఏమిటి? ఆ అబ్బాయి సంస్కారం ఏమిటి? పిల్లని చూడకుండా పెళ్ళికి ఒప్పుకున్నాడు''

''అలా ఒప్పుకున్నవాడిని నేనేరా బాబోయ్!''

''నోరు ముయ్యరా. ఆ ముఖం చూడండిరా. పులి విస్తరాకు ముఖం వాడూనూ.''

''నిజంరా బాబోయ్! కొట్టకండి'' అరుస్తున్నాడు శంకరం.

''ఒరే శంకరం'' బామ్మ గట్టిగా కదిపింది.

''ఏదైనా పీడ కల వచ్చిందా?''

ఎదురుగా బామ్మను చూసి శంకరం లేచి మంచం మధ్యన కూర్చున్నాడు. ప్రేమకల మనస్సును కలత పెట్టింది. వాస్తవంలో ప్రేమ ఇంకెంత చేదుగా ఉంటుందో అని బెదిరిపోయాడు.

అప్పుడు బామ్మ చదువుతున్న భగవద్గీత శ్లోకం చివరి మాటలు 'పరధర్మో భయావహః'' అన్న మాటలు అతడి చెవిలో పడ్డాయి. వెళ్ళి అర్థం చెప్పమన్నాడు.

''ఒరే బుజ్జీ! స్టార్ టీవీ చూసి నీవు ప్రేమించి పెళ్ళి చేసుకోవాలనుకున్నావా? అది పాశ్చాత్య ధర్మం. పర ధర్మం. అది భయం కలిగిస్తుంది అని రా అర్థం'' చెప్పింది బామ్మ.

శంకరానికి మరోసారి ఒళ్ళు జలదరించింది.

తన ధర్మానికి దూరం అయితే భయంకరం. పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లు.

వెంటనే ప్రేమాయణానికి స్వస్తి చెప్పాడు శంకరం. పెళ్ళి చేసుకుని ప్రేమించాలని ఆ క్షణమే నిశ్చయించుకున్నాడు.

★

